క్లుప్తంగా

50 ఆకుల తునికాకు కట్టకు రూ.6 చెల్లించాలి

సింగరేణి(కొత్తగూడెం): గిరిజన, ఆదివాసీలు సేకరించే 50 ఆకుల తునికాకు కట్టకు రూ.6 చెల్లించేలా కాంట్రాక్టర్లకు టెండర్లు కేటాయించాలని న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గాని నాగేశ్వరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 50 ఆకుల కట్టకు రూ.6 చెల్లించడమే కాక పెండింగ్‌లో ఉన్న బోనస్ చెల్లించాలని ఏళ్లుగా కోరుతున్నప్పటికీ పట్టించుకోకపోవడం సరికాదని పేర్కొన్నారు. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవడమే కాక గతంలో బోనస్ చెల్లింపులో జరిగిన అవినీతిపై విచారణ చేయించాలని, ఆకు సేకరణలో ప్రాణాలు కోల్పోయే వారి కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎంపీ రఘురాంరెడ్డి జన్మదిన వేడుకలు

జూలూరుపాడు: ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం జూలూరుపాడులో కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. లేళ్ల వెంకటరెడ్డి, మాళోత్ మంగీలాల్ నాయక్, చీమలపాటి భిక్షం, దుద్దుకూరి మధుసూదన్ రావు, వేల్పుల నరసింహారావు, బానోత్ లాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

పాల్వంచ: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేస్తూ 20వ తేదీన చేపట్టిన చలో విద్యుత్ సౌధను విజయవంతం చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ కేటీపీఎస్ చైర్మన్ నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కేటీపీఎస్ అంబేడ్కర్ సెంటర్‌లో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో త్రినాథ్, సాయికిరణ్, రవి, యాకూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు. కాగా, విద్యుత్‌సౌధకు వెళ్లేందుకు సిద్ధమైన ఆర్టిజన్ల సెలవులను అధికారులు రద్దు చేశారు.

ఘనంగా వార్షికోత్సవం

పాల్వంచ: పట్టణంలోని నవ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య కేంద్రం 14వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ వి.శరత్‌బాబు, అడ్మినిస్ట్రేటర్ దేవిచందర్ మాట్లాడుతూ నవభారత్ నేత్ర వైద్య కేంద్రంలో ఇప్పటి వరకు 9,33,763 మందికి కంటి వైద్యం అందించామని తెలిపారు. అనంతరం ఉత్తమ ఉద్యోగి ఎండీ షైనాజ్‌బేగంకు అవార్డు అందించారు. ఫయాజ్, వైవీ శ్రీనివాసరావు, అనుప్రియ, హారిక, కిరణ్మయి పాల్గొన్నారు.

ఏఐటీయూసీ కృషితోనే కనీస వేతనాలు

టేకులపల్లి: ఏఐటీయూసీ కృషి ఫలితంగానే సింగరేణిలో పనిచేస్తున్న నర్సరీ కార్మికులకు కనీస వేతనాల అమలుకు యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసిందని బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొంగర వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం కోయగూడెం ఓసీపీలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. నర్సరీ కార్మికులకు మార్చి 1వ తేదీ నుంచి కనీస వేతనాలు, సీఎంపీఎఫ్, బోనస్, బ్యాంకు జీతాలు అమలు చేయడానికి యాజమాన్యం సర్క్యులర్ విడుదల చేసిందని చెప్పారు. శ్రీనివాస్, నర్సరీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులం నిర్మించాలి

ఇల్లెందురూరల్: రొంపేడు కేంద్రంగా సమీకృత గురుకులం నిర్మించాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అజ్మీర భావ్‌సింగ్, చాంద్‌పాషా, మునుగంటి శివ, బానోత్ బిచ్చ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పాల్వంచరూరల్: ఆటోను బొలేరో వాహనం ఢీకొట్టిన ఘటనలో ఆటోడ్రైవర్‌కు గాయాలయ్యాయి. మండలంలోని రంగారంగాపురం కిన్నెరసాని బ్రిడ్జి వద్ద మంగళవారం రాత్రి పాల్వంచ నుంచి భద్రాచలం వైపు వెళ్తున్న ఆటోను మణుగూరు నుంచి పాల్వంచకు వస్తున్న బొలేరో వాహనం ఢీకొట్టింది. ఘటనలో ఆటోడ్రైవర్ మాలోతు హరికృష్ణకు గాయాలు కాగా ఆయన ఫిర్యాదుతో డ్రైవర్ కొండా రమేశ్‌బాబుపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

రుణాలు పెంచి ఇవ్వండి..

పాల్వంచ: కేటీపీఎస్ పరిధిలోని కోఆపరేటివ్ సొసైటీ సభ్యుల రుణాలను రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచి ఇవ్వాలని టీఆర్‌వీకేఎస్ జెన్‌కో కార్యదర్శి సీహెచ్ రమేశ్ అన్నారు. బుధవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో సొసైటీ అధ్యక్షుడు ధర్మరాజు నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందించారు. పాలకవర్గ పదవీ కాలం ఆరు నెలలు పెరగడంపై హర్షం వ్యక్తం చేశారు.

బావిని బాగు చేయండి..

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులో కాకతీయుల కాలం నాటి అద్భుత కట్టడమైన రాజాబావిని అభివృద్ధి చేయాలని కోరుతూ బీఎస్పీ నాయకుడు తంబర్ల నరసింహారావు బుధవారం ఎంపీడీఓ కరుణాకర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

అనుకూలిస్తోంది...

రైతులకు అండగా వలస కూలీలు

- ఏటా ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది రాక
- స్థానికంగా కూలీల కొరత తీరుతోందంటున్న అన్నదాతలు



గంగారంతండాలో మిర్చి కోస్తున్న వలస కూలీలు



అనంతారంలో మిర్చి గ్రేడింగ్ చేస్తున్న వలసకూలీలు

జూలూరుపాడు: తెలంగాణకు సరిహద్దుగా ఉన్న ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వేలాది మంది ఆదివాసీ గిరిజన, నిరుపేద కుటుంబాలతోపాటు కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన నిరుపేద గిరిజనులు ఉపాధి కోసం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వస్తున్నారు. ఏటా జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం పెరుగుతుండడం, ఆ రాష్ట్రాలతో పోలిస్తే పనులు పుష్కలంగా దొరుకుతుండటంతో పొరుగు రాష్ట్రాల కూలీలు సుమారు 20 వేల మందికి పైగా వస్తున్నట్లు అంచనా. ఈ ఏడాది జిల్లాలో మిర్చి సుమారు 25 వేల ఎకరాల విస్తీర్ణంలో సాగైంది. ఇదే సమయాన స్థానికంగా కూలీల లభ్యత లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో వలస కూలీలు రైతులకు అండగా నిలుస్తుండగా వారికి సైతం ఉపాధి లభిస్తోంది.

అక్కున చేర్చుకుంటున్న రైతాంగం

పొరుగు రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వచ్చే కూలీలను స్థానిక రైతులు అక్కున చేర్చుకుంటున్నారు. అక్కడ ఉపాధి దొరకక, చేతిలో చిల్లిగవ్వలేక భార్యాపిల్లలతో పస్తులు ఉండలేని పరిస్థితులు ఎదురవుతుండడంతో ఉపాధి కోసం వస్తున్న వారు రైతులకు అండగా నిలుస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా జూలూరుపాడు మండలంలో మిరప సాగవడంతో కాయలు కోసేందుకు స్థానికంగా కూలీలు లేని పరిస్థితుల్లో వలస కూలీలు ఆసరా అవుతున్నారు. వీరంతా పొలాల్లోనే గుడారాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తారు. దొడ్డు బియ్యం అన్నంలోకి మిరపకాయలతో పచ్చడి తయారు చేసుకోవడం, అంబలి(గంజి), నిప్పుపై కాల్చిన మిరపకాయలు, చింతపండు, నీళ్లు కలిపి పులుసు తయారు చేసుకుని ఆహారంగా స్వీకరిస్తారు. తెల్లవారుజామున నిద్రలేచి వంట సిద్ధం చేసుకుని ఆరు గంటలకల్లా పనిలోకి దిగుతారు. దీంతో రైతులకు సమయం కలిసి వస్తోంది. మూడు, నాలుగు నెలల పాటు ఇక్కడ పని చేసి మిర్చి కోతలు పూర్తయ్యాక వలస కూలీలు స్వరాష్ట్రాలకు వెళ్తారు.

మా వద్ద పనులు లేకే..



మా రాష్ట్రంలో పనులు లేక మిర్చికోతలకు వచ్చాం. మూడేళ్లుగా ఉపాధి కోసం ఇక్కడకు వస్తున్నాం. మా రాష్ట్రంలో అంతంత మాత్రంగా పనులున్నా, డబ్బు కూడా తక్కువ ఇస్తారు. అందుకే ఇక్కడకు వచ్చి మిర్చి కోతలు పూర్తయ్యే వరకు ఉంటాం.

–మంగళ్ కౌసిక్, ఛత్తీస్‌గఢ్

మిర్చి కోతలకు వచ్చాం..



ఐదేళ్లుగా మిర్చి కోతలకు జూలూరుపాడు మండలం వస్తున్నాం. భార్యాబిడ్డలతో సహా వస్తున్న మమ్మల్ని ఇక్కడి రైతులు బాగానే చూసుకుంటున్నారు. కుటుంబాలతో మూడు, నాలుగు నెలలు ఉండి మిర్చి కోతలు పూర్తయ్యాక వెళ్లిపోతాం.

–ఆత్మారామ్, మహారాష్ట్ర

ఎంతో కొంత సంపాదన



రోజుకు రూ.500 నుంచి రూ.600 వరకు వస్తాయి. మా రాష్ట్రంలో పనులు దొరకవు. పని ఉన్నా డబ్బులు తక్కువగా రావడంతో కుటుంబం గడవడానికి ఇబ్బంది పడాల్సి వస్తోంది. అందుకే వ్యవసాయ పనుల కోసం రైతుల సూచనతో ఇక్కడకు వస్తున్నాం.

–భిగారీ, మధ్యప్రదేశ్

వలస కూలీలపైనే ఆధారం



కూలీల కొరత కారణంగానే వలస కూలీలపై ఆధారపడాల్సి వస్తోంది. పొలాల్లోనే కూలీలకు కరెంటు, నీటి సౌకర్యం కల్పించడమే కాక బియ్యం, సరుకులు సమకూరుస్తున్నాం. ఈ ఏడాది ఆరు ఎకరాల విస్తీర్ణంలో మిర్చి పంట సాగు చేయగా కూలీలతో కోయిస్తున్నా.

–బండారు వెంకయ్య, రైతు, అనంతారం

కూలీలకు అన్ని సౌకర్యాలు



ఈ ఏడాది మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 50మంది కూలీలు వచ్చారు. మిర్చి కోసేందుకు వచ్చిన వారికి కిలోకు రూ.12చొప్పున ఇస్తూనే ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఈ ఏడాది మిర్చి దిగుబడి తగ్గడమే కాక మార్కెట్‌లో ధర లేకపోవడం బాధగా ఉంది.

–గుగులోత్ రాములు, రైతు, గంగారం తండా

ఇది ప్రజావ్యతిరేక బడ్జెట్

వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన



ఇల్లెందు: నిరసన తెలుపుతున్న నాయకులు

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేకమైందని దీన్ని యావత్ లోకం వ్యతిరేకించాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. బుధవారం ఇల్లెందులో వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎన్‌డీ నేత ఎండీ రాసుద్దీన్ అధ్యక్షతన జరిగిన సభలో సీపీఎం జిల్లా నాయకుడు ఎస్‌ఏ నబీ, సీపీఐ పట్టణ కార్యదర్శి బంధం నాగయ్య, మాస్‌లైన్ జిల్లా నాయకుడు నాయిని రాజు, ఎన్డీ చంద్రన్న వర్గం జిల్లా నాయకుడు రాంసింగ్ మాట్లాడారు. విద్యా, వైద్యం, సంక్షేమం పూర్తిగా విస్మరించారని, సరైన కేటాయింపులు జరపలేదని, ఏ ఒక్క వర్గాన్ని సంతృప్తి పర్చని బడ్జెట్‌ను అన్ని వర్గాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని దుయ్యబట్టారు. ఈ రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వామపక్షాల నేతలు మోకాళ్ల రమేశ్, చంద్రకళ, మంచాల వెంకటేశ్వర్లు, ఆలేటి కిరణ్, తాళ్లూరి కృష్ణ, రాజులోథ్, మండల వెంకన్న, అజ్మీర బిచ్చా, యాకుబ్‌షావలి, కాంతారావు, సాంబ పాల్గొన్నారు.

జూలూరుపాడులో..

జూలూరుపాడు: కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో బుధవారం జూలూరుపాడులో నిరసన తెలిపారు. ప్లకార్డులు చేతబూని ర్యాలీగా బయలుదేరి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ చంద్రుగొండ క్రాస్ రోడ్ వద్ద ఆందోళన చేపట్టారు. వామపక్ష పార్టీల నాయకులు కొండపల్లి శ్రీధర్, యాసా నరేశ్, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, వై.గోపాల్‌రావు, వల్లోజి రమేశ్, యల్లంకి మధు, ఎస్కే చాంద్‌పాషా, వల్లమల సామేలు, గుడిమెట్ల సీతయ్య, బడుగు వీరస్వామి, గార్లపాటి శివకృష్ణ, పాలెపు ప్రభాకర్, రాయల సిద్ధు, కూరాకుల నరసింహారావు పాల్గొన్నారు.

పాల్వంచ, టేకులపల్లిలో..

పాల్వంచ/టేకులపల్లి: వామపక్షాల నిరసన కార్యక్రమంలో బండి నాగేశ్వరరావు, పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు, శనగారపు శ్రీనివాసరావు, వై.వెంకటరామయ్య, జకరయ్య, వైఎస్ గిరి, లాల్‌సింగ్, కొంగర అప్పారావు, ఖాసీం, బిక్కులాల్, ఆదినారాయణ, వెంకటేశ్వర్లు, కృష్ణ, రాము, దొడ్డ రవి, తులసీరాం, సత్య, రాణి, సోమలింగం, వెంకటేశ్వరరావు, టేకులపల్లిలో కల్తీ వెంకటేశ్వర్లు, రామచందర్, ఈసం నరసింహారావు, బానోతు ఊక్లా, జర్పుల సుందర్, హర్జ్య, గుగులోత్ రామచందర్, డి.ప్రసాద్, నోముల భానుచందర్, తోటకూరి సతీశ్, భూక్య నర్సింగ్, ఏనుటి నాగయ్య తదితరులు పాల్గొన్నారు. తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేయాలి



శుభపత్రికలను ఆవిష్కరిస్తున్న కమిటీ బాధ్యులు

పాల్వంచ: పట్టణంలోని శ్రీనివాసగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం (గుట్ట)పై మార్చి 24 నుంచి 27వ తేదీ వరకు జరిగే శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలను విజయవంతం చేయాలని భక్త సమాజ మండలి అధ్యక్షుడు ఆరుట్ల లక్ష్మణాచార్యులు, కొత్త వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఆలయ పాదాల మండపం వద్ద కల్యాణ మహోత్సవ శుభపత్రిక ఆవిష్కరించారు. ఆలయ ప్రధాన అర్చకులు తోలేటి నగేశ్‌శర్మ, సహాయ అర్చకులు ఫణిరాజాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణ కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పసుమర్తి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ధర్మపురి రాము, ఊకె భద్రయ్య, తాటికొండ శ్రీలత, బండి నారాయణ, జిన్నె రమేశ్, రాంజీ అంబేడ్కర్, నరసింహకుమార్, బండి వెంకటేశ్వర్లు, కంకాల వెంకటేశ్వరరావు, మేదరమెట్ల శ్రీనివాసరావు, వేమూరి వెంకటేశ్వరరావు, సత్యం, వెంకటేశ్వరరావు, చలపతిరావు, వెంకట సుబ్బయ్య, శ్రీనివాసరావు, బెల్లం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీకి ఘన నివాళి



కొత్తగూడెంటౌన్: నివాళులర్పిస్తున్న జడ్జి భానుమతి, న్యాయవాదులు

జూలూరుపాడు: మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ, భజరంగదళ్, ఛత్రపతి శివాజీ సేన సంయుక్త ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో సోడె శ్రీరామ్, అమర్నాథ్, యలమద్ది సాయికృష్ణ, మద్దెబోయిన నాగరాజు, కొండెం శివాజీ, లక్ష్మయ్య, బోడా రమేష్, మెరుగు విజయ్‌కుమార్, నేరేళ్లకుంట శ్రీనివాసరావు, కొదుమూరి నాగేశ్వరరావు, పవన్ పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో..

కొత్తగూడెంటౌన్: జిల్లా కోర్టులో కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీమహరాజ్ జయంతిలో జడ్జి జి. భానుమతి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: వీహెచ్‌పీ ఖమ్మం జిల్లా సంఘటన కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు, రాములోనియా, సీత, వేముల రాజేశ్వరరావు, కీర్తి ప్రసాద్, మెరుగు చింటు, కె.సంజీవ్‌రెడ్డి, బలగానీ గోపీకృష్ణ, పూన్యానాయక్, నాగన్న, దోమల మహేశ్వర్, శుక్లాల్ పాసీ, సంతోష్, పవన్, రతన్ ఠాగూర్, రాహుల్ కహార్, నరసింహారెడ్డి, సతీశ్‌పాసీ, తేజ్ మనోహర్, నిరంజన్, భరత్‌రాజ్ పురోహిత్, కరణ్ పాసీ పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: తేజావత్ రాములు, స్వామి, దేశ్యాసాధు, రాగు, బిచ్చాసాధు, చందు, రమేశ్, సక్రాం, బాలు, వీరన్న, అనూష, నీలసోమిలి, రాజేశ్వరిదేవి, రమేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ నాయకుడి మృతికి సంతాపం

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు గ్రామానికి చెందిన హమాలీ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) సీనియర్ నాయకుడు అప్పికట్ల బాలకృష్ణ బుధవారం మృతి చెందాడు. ఇటీవల హమాలీ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు ఆటో పైనుంచి కింద పడటంతో బాలకృష్ణ గాయపడి, చికిత్స పొందుతూ చెందాడు. బాలకృష్ణ మృతదేహాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా, కంచర్ల జమలయ్య, ఎస్కే చాంద్‌పాషా, యాసా రోశయ్య, కొట్టే శ్రీను, నరేశ్, ఊడల సుధా, చంద్రమౌళి, అప్పికట్ల ప్రసాద్, రామారావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు.

సమగ్రాభివృద్ధికి కృషి

పాల్వంచరూరల్: కొత్తగూడెం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నేతృత్వాన కృషి చేయనున్నట్లు సీపీఐ రాష్ట్ర నాయకుడు ముత్యాల విశ్వనాథం తెలిపారు. మండలంలోని సూరారంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం గ్రామ శాఖ కార్యదర్శిగా లింగంపల్లి నాగేశ్వరరావుతో పాటు 15 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

మళ్లీ 'డబుల్' వివాదం

ఇల్లెందురూరల్: మండలంలోని చల్లసముద్రం గ్రామ పంచాయతీ వేములవాడ గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించిన స్థల వివాదం మళ్లీ రాజుకుంది. ఏడేండ్ల కిందట వేములవాడలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లను నిర్మించారు. స్థానికులు 20 మందికి కేటాయించి పెద్దల సమక్షంలో గృహప్రవేశం చేయించారు. ఇళ్లు నిర్మించిన చోట ఖాళీగా ఉన్న స్థలం తనదని భూమి దానం చేసిన వ్యక్తి వాదిస్తుండగా, డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం పరిధిలోనిదని లబ్ధిదారులు చెబుతున్నారు. నాలుగేళ్లుగా ఈ వివాదం నడుస్తోంది. తాజాగా తన స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు అనుచరులతో బుధవారం డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమదాయం వద్దకు వచ్చిన దాత స్థలాన్ని చదును చేస్తుండగా లబ్ధిదారులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు కలుగచేసుకొని స్థలానికి సంబంధించిన పత్రాలు ఉంటే చూపించాలని, అప్పటివరకు స్థలం జోలికి వెళ్లొద్దని లబ్ధిదారులకు సూచించారు.

సరోత్తమ్‌రెడ్డిని గెలిపించండి

జూలూరుపాడు: బీజేపీ వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తమ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు బుధవారం ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో చిలుకూరి రమేశ్, తెల్లం నరసింహారావు, సిరిపురపు ప్రసాద్, భూక్యా శ్రీను, భూక్యా రమేశ్, పూరేటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ ఆదర్శప్రాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెంఅర్బన్: సంత్ సేవాలాల్ మహరాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ తెలిపారు. బుధవారం లక్ష్మీదేవిపల్లి మండలం ఇల్లెందు క్రాస్‌రోడ్ హరిత కన్వెన్షన్‌లో సేవాలాల్ జయంతి కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. సేవాలాల్ లంబాడీల అభ్యున్నతికి కృషిచేశారని కొనియాడారు. తొలుత భోగ్‌భండారో కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో నృత్యాలు చేశారు. అనంతరం కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ మాట్లాడారు. కార్యక్రమంలో బానోత్ నాగేశ్వరరావు, సాబీర్‌పాషా, రమేశ్‌రాథోడ్, రమేశ్‌నాయక్, ఉపేందర్, మోహన్‌నాయక్, శ్రీనివాస్‌నాయక్, బాలకృష్ణ చౌహాన్, లాల్‌సింగ్, గోవిందనాయక్, శ్రీనివాస్‌నాయక్ రాజేశ్‌నాయక్, రాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే..



టేకులపల్లి: విజేతలకు బహుమతి ఇస్తున్న దృశ్యం

టేకులపల్లి: మండలంలోని సులానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం కాంప్లెక్స్ పరిధిలోని పది ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు బాలమేళా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెచ్‌ఎం గుగ్రం దేవదాసు మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకే బాలమేళ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కిశోర్‌సింగ్, బాబా, రాందాస్, కన్నయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యాబోధన చేయాలి

జూలూరుపాడు: విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని జూలూరుపాడు ఎంఈఓ బానోత్ జుంకీలాల్ అన్నారు. బుధవారం పడమటనర్సాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలకు బాలమేళా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన టీఎల్‌ఎంలను ప్రదర్శించారు. విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టులపై టాలెంట్ టెస్టులు నిర్వహించారు. విజేతలకు ఎంఈఓ బహుమతులు పంపిణీ చేశారు. అదేవిధంగా పడమటనర్సాపురం స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో బెస్ట్ స్కూల్‌గా ఎంపికైన పెద్దతండా ప్రాథమిక పాఠశాలకు ఎంఈఓ బహుమతి అందజేశారు. కార్యక్రమంలో బి.పుల్లారావు, దేవేందర్, అరుణ, విజయ, నాగజ్యోతి, వెంకటేశ్వర్లు, గోపాల్‌రావు, లక్ష్మణ్‌రావు, బాబూరావు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ఏపీఎం దుర్గారావు

ఇల్లెందురూరల్: పౌష్టికాహారం తీసుకుంటూ జాగ్రత్తలు పాటిస్తే మనిషి జీవన ప్రమాణస్థాయి పెరుగుతుందని ఎంపీడీఓ ధన్‌సింగ్, సెర్ప్ డీపీఎం నాగజ్యోతి, ఏపీఎం దుర్గారావు అన్నారు. మండలంలోని సీఎస్పీ బస్తీ కమ్యూనిటీ హాల్‌లో ఆహారం, ఆరోగ్యం, పోషణ, వాష్ కార్యక్రమాలపై వీవో పదాధికారులు, వీవో హెల్త్ సభ్యులు, వీవోఏలకు బుధవారం ఒక రోజు శిక్షణ శిబిరం నిర్వహించారు. శాస్త్రసాంకేతిక రంగం పురోభివృద్ధితో ప్రతి ఒక్కరూ ఉరుకులు, పరుగుల జీవనానికి అలవాటు పడ్డారని, తద్వారా కొత్త రోగాలను కొనితెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. దీనిని అధిగమించేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఊకే నాగమణి, సౌజన్య, ఖమ్మంపాటి నర్సింహారావు, నాగేంద్ర, భూలక్ష్మి, సంపత్, లాలయ్య, కొమ్మాలు, రాంమ్మూర్తి, నందకుమారి, ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి అవగాహన



మాట్లాడుతున్న డీఎం దేవేందర్‌గౌడ్

చుంచుపల్లి: ఆర్టీసీ సిబ్బందికి బుధవారం కొత్తగూడెం డిపోలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. డీఎం.దేవేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించటమే ఆర్టీసీ ప్రధాన లక్ష్యమన్నారు. ఎప్పటికప్పుడు ఆర్టీసీ యాజమాన్యం నిర్దేశించే లక్ష్యాలను సమష్టిగా సాధించాల్సిన అవసరం ఉందన్నారు. మరో రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం యోగా గురువు కె.కమలారాణి యోగా, దాని ప్రాముఖ్యత, ఆరోగ్య సూత్రాలను వివరించారు. కార్యక్రమంలో డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జేకేఓసీని నడిపించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు: జేకేఓసీని కొనసాగించాలని, ప్రస్తుతం కొనసాగుతున్న కార్మికులను బదిలీ చేయొద్దని ఏఐటీయూసీ ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. బుధవారం ఏఐటీయూసీ ప్రతినిధులు డైరెక్టర్ పీపీ కొప్పుల వెంకటేశ్వర్లును కొత్తగూడెంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ సారయ్య మాట్లాడారు. జేకేఓసీలో అపారమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, కార్మికుల సమష్టి కృషితో అనేక అవార్డులు లభించాయని తెలిపారు. రాంగోపాల్, బాజీసైదా, సురేందర్, రమణమూర్తి పాల్గొన్నారు.

నీటి ఎద్దడిపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న ఎంపీడీఓ ధన్‌సింగ్

ఇల్లెందురూరల్: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి, విద్యుత్ సమస్యలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ధన్‌సింగ్, తహసీల్దార్ రవికుమార్ సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం రెవెన్యూ, పంచాయతీరాజ్, ట్రాన్స్‌కో, మిషన్ భగీరథ, సెర్ప్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వేసవి ప్రారంభదశలో ఉన్నందున రానున్న రోజుల్లో నీటిఎద్దడి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

విద్యార్థులు నైపుణ్యం మెరుగుపర్చుకోవాలి



మాట్లాడుతున్న సుధీర్‌కుమార్

పాల్వంచ: నేటి పోటీ ప్రపంచంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు నిర్వహించే నియామక ప్రక్రియలో కమ్యూనికేషన్ స్కిల్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఉందని కేఎల్‌ఆర్ విద్యాసంస్థల చైర్మన్ టి.భరత్ కృష్ణ అన్నారు. స్థానిక అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల కోసం తెలంగాణ టాస్క్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. భరత్ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే కమ్యూనికేషన్ స్కిల్స్‌పై దృష్టి సారించాలని, మారుతున్న సాంకేతిక మార్పులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పి.సుధీర్‌కుమార్ అవగాహన కల్పించారు.